సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

సోమవారం । 6 । మే । 2024

I



ఎన్నికలప్పుడే గుర్తొస్తాయి!

బయ్యారం ఉక్కు పరిశ్రమ, బయ్యారం, తులారాం ప్రాజెక్టులు.. ఎన్నికలప్పుడే రాజకీయ నాయకులకు గుర్తుకొస్తున్నాయి. అప్పుడే వాటి జపం చేస్తున్నారు. - IIలో▸



మెరుగైన వైద్యసేవలు అందించాలి

వైద్యులు నూతన చికిత్స విధానాలను తెలుసుకొని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సంధ్య అన్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం $43^0/29^0$

వాతావరణం

ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

9 నుంచి కల్యాణ బ్రహ్మోత్సవాలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ శేషభారతి తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆలయంలో ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి వాహన సేవలు ఉంటాయన్నారు. 12న జరిగే కల్యాణోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.516 చెల్లించి రశీదు పొందవచ్చని, ప్రసాదం, అక్షింతలు, శేష వస్త్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, దేవాలయ పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది కూచన హరినాథ్, కృష్ణ, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

హైటెక్ వ్యభిచారంపై సీపీ ఆరా!

హసన్‌పర్తి: నగర పరిధి వంగపహాడ్‌లోని ఓ ప్రాంతంలో నిర్వహిస్తున్న హైటెక్ వ్యభిచారంపై నగర పోలీస్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ఆరా తీసినట్లు తెలిసింది. ఇక్కడ జరుగుతున్న హైటెక్ వ్యభిచారంపై ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈనేపథ్యంలో ఎన్ని రోజులుగా ఈ వ్యవహారం సాగుతోంది.. అద్దెకు ఇచ్చిన గదులు ఎవరివి? వ్యభిచారం నిర్వాహకులు ఎవరు? అమ్మాయిలను ఎక్కడికి నుంచి తీసుకొస్తున్నారనే వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. బ్లూకోల్ట్స్ సిబ్బంది నజర్ వేసినట్లు తెలిసింది.

ఎండోమెంట్‌పై విజిలెన్స్ విచారణ!

- ఫేక్ సర్టిఫికెట్లతో పదోన్నతులు

వరంగల్: వరంగల్ దేవాదాయశాఖపై రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. శాఖలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి పదోన్నతులు పొందినట్లు పలువురు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈమేరకు సంబంధిత పదోన్నతులు పొందిన వారి వివరాల్ని ఆయా జిల్లాలకు చెందిన విజిలెన్స్ అధికారులు రెండు నెలల క్రితం సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు వరంగల్ జిల్లా పరిధిలో ఇలాంటి ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి పలువురు పదోన్నతులు పొందినట్లు గుర్తించినట్లు సమాచారం. ఈవిచారణపై వివరణ కోరేందుకు దేవాదాయ శాఖ డీసీకి ఫోన్ చేయగా కలవలేదు. ఏసీ సునీతకు ఫోన్ చేయగా స్పందించలేదు.

నేటి ప్రజావాణి రద్దు

కాళోజీ సెంటర్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది పార్లమెంట్ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి ఉండదని పేర్కొన్నారు. ఈవిషయాన్ని గమనించి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని ఆమె కోరారు.

కేసీఆర్‌ను కలిసిన రాకేశ్‌రెడ్డి



హన్మకొండ: బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి కలిశారు. వరంగల్ ఖమ్మం నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన సందర్భంగా ఆదివారం కరీంనగర్ జిల్లా వీణవంకలో కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపి ఆశీస్సులు అందుకున్నారు. అంకిత భావంతో పని చేసి గెలుపొంది రావాలని, పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేసీఆర్ సూచించినట్లు రాకేశ్‌రెడ్డి తెలిపారు. పార్టీ తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని, పార్టీలోని ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు తీసుకుని విజయం సాధిస్తానని చెప్పారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని స్వగృహంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ వొడితెల లక్ష్మీకాంతారావును మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీస్సులు తీసుకున్నారు.

మీటర్ మోగుతోంది!

ఉమ్మడి జిల్లాలో భారీగా పెరిగిన విద్యుత్ వాడకం

- మండుతున్న ఎండలు
- చల్లదనానికి ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్న ప్రజలు
- రెట్టింపైన విద్యుత్ వినియోగం

హన్మకొండ:

భానుడి భగభగలతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు కూలర్లు, ఏసీలను వాడుతుండడంతో విద్యుత్ వాడకం పెరిగింది. ఎన్నడూ లేని విధంగా 45 నుంచి 46 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో జనం అల్లాడుతున్నారు. గతంలో ఫ్యాన్లు వాడిన ప్రజలు, ఆ తర్వాత కూలర్లకు వచ్చారు. ప్రస్తుత ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో కూలర్ల ద్వారా వచ్చే చల్లదనం సరిపోక ఏసీల వైపు మళ్లారు. ఏసీల వాడకం పెరగడంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఉమ్మడి జిల్లాలో విద్యుత్ డిమాండ్ తారస్థాయికి చేరుకుంది. ప్రధానంగా హనుమకొండ జిల్లాలో అత్యధికంగా ఏప్రిల్ 30న 322 మెగావాట్లకు డిమాండ్ పెరిగింది. వరంగల్ జిల్లాలో ఏప్రిల్ 18న 204 మెగావాట్లకు, ఏప్రిల్ 15న 137 మెగావాట్లు, మహబూబాబాద్ జిల్లాలో గత నెల 18న 269 మెగావాట్లు, జేఎస్ భూపాలపల్లి, ములుగు జిల్లాలో అత్యధికంగా ఏప్రిల్ 16న 201 మెగావాట్లకు చేరింది.

అధిక వినియోగం..

హనుమకొండ జిల్లాలో ఏప్రిల్ 19న అత్యధికంగా 4.160 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారు. ఈనెల 3న 3.960 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. వరంగల్ జిల్లాలో అత్యధికంగా గతనెల 19న 3.390 మిలియన్ యూనిట్లు, ఈనెల 3న 2.900 మిలియన్ యూనిట్లు, జనగామ జిల్లాలో అత్యధికంగా ఏప్రిల్ 15న 2.690 మిలియన్ యూనిట్లు, ఈనెల 3న 1.890 మిలియన్ యూనిట్లు, మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా గత నెల 19న 2.250 మిలియన్ యూనిట్లు, ఈనెల 3న 1.890 మిలియన్ యూనిట్లు, భూపాలపల్లి, ములుగు జిల్లాలో ఏప్రిల్ 20న 4.190 మిలియన్ యూనిట్లు, ఈనెల 3న 3.740 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. ఏప్రిల్ 20వ తేదీ వరకు వ్యవసాయ అవసరాలకు ప్రధానంగా వరికి నీరందించేందుకు బావులు, బోరు బావుల నుంచి నీటిని తోడేందుకు పంపుసెట్ల వాడకంతో విద్యుత్ వినియోగం మరింత పెరిగింది. ఆ తర్వాత వరి చేతికి రావడంతో సాగునీటి వినియోగం తగ్గింది. గతనెల 20 తర్వాత వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగం తగ్గినా, గృహ, ఇతర అవసరాలకు విద్యుత్ వినియోగం పెరిగింది. ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో గృహ వినియోగం భారీగా పెరిగింది. రాత్రింబవళ్లు కూలర్లు, ఏసీలు వాడుతుండడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది.



కాజీపేటలో అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

గతేడాది, ప్రస్తుత మే నెలలో జిల్లాల వారీగా విద్యుత్ డిమాండ్ ఇలా..(మెగావాట్లలో)

జిల్లా	మే1	మే2	మే3
	(2023 / 2024)	(2023 / 2024)	(2023 / 2024)
హనుమకొండ	164.51 / 212.21	166.46 / 229.1	178.46 / 237.01
వరంగల్	115.98 / 160.83	103.12 / 177.21	110.89 / 175.72
జనగామ	61.04 / 94.25	59.31 / 92.79	64.21 / 115.5
మహబూబాబాద్	86.13 / 128.62	85.15 / 139.34	85.52 / 138.1
జయశంకర్–ములుగు	139.32 / 148.02	137.76 / 178.75	137.95 / 149.04

జిల్లాల వారీగా విద్యుత్ వినియోగం..

- హనుమకొండ జిల్లాలో గతేడాది మే 1న 2.960 మిలియన్ యూనిట్లు, 2న 3.18, 3న 3.59 మిలియన్ యూనిట్లు, ఈ నెల 1న 3.680, 2న 3.830, 3న 3.960 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను వాడారు.
- వరంగల్ జిల్లాలో గతేడాది మే 1న 1.490, 2న 2.180, 3న 2.300 మిలియన్ యూనిట్లు, ఈ నెల 1న 2.760, 2న 2.820, 3న 1.890 మిలియన్ యూనిట్లు వినియోగించారు.
- జనగామ జిల్లాలో గతేడాది మే1న 1.200, 2న 1.190, 3న 1.310 మిలియన్ యూనిట్లు, ఈ మాసం 1న 1.840, 2న 1.860, 3న 1.890 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం జరిగింది.
- మహబూబాబాద్ జిల్లాలో గతేడాది మే 1న 0.970, 2న 1.040, 3న 1.130 మిలియన్ యూనిట్లు, ఈ నెలలో 1న 1.810, 2న 1.890, 3న 1.890 మిలియన్ యూనిట్లు..
- భూపాలపల్లి, ములుగు జిల్లాలో గతేడాది మే 1న 2.400, 2న 2.790, 3న 2.780 మిలియన్ యూనిట్లు, ఈ నెల 1న 3.200, 2న 3.230, 3వ తేదీన 3.740 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు.

పెరిగిన లోడ్..

విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా పెరగడంతో సబ్‌స్టేషన్లు, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పెరిగింది. ఎన్పీడీసీఎల్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. యుద్ధప్రాతిపదికన సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయిని పెంచుతున్నారు. డిస్ట్రిబ్యూషన్ల సామర్థ్యం పెంచడంతో పాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రింబవళ్లు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. ప్రధానంగా గ్రేటర్ పరిధి హనుమకొండ టౌన్, వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలో అధికారులు, ఉద్యోగులు నిరంతరం పని చేస్తున్నారు. వినియోగదారులకు విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

హాజరు 97.73%



హనుమకొండలోని సెంటర్ వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ మంజులాదేవి



మాస్టర్ జీ డిగ్రీ కళాశాల సెంటర్‌లోకి పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా నీట్

- నిమిషం నిబంధనతో ముందుగానే సెంటర్లకు చేరిన విద్యార్థులు
- సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష
- తొమ్మిది సెంటర్లలో నిర్వహణ
- పరిశీలించిన కోఆర్డినేటర్

విద్యారణ్యపురి: వైద్య విద్యలో ప్రవేశాలకు ఆదివారం ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) ప్రశాంతంగా ముగిసింది. వరంగల్, హనుమకొండలో కలిపి 9 సెంటర్లలో నీట్ పరీక్ష నిర్వహించారు. ఒక్కో సెంటర్‌కు చీఫ్ సూపరింటెండెంట్లు ఒకరి చొప్పున, అబ్జర్వర్లు ఇద్దరు చొప్పున పర్యవేక్షించారు. నిమిషం నిబంధన అమలు నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 11.30 గంటల నుంచే సెంటర్లలోకి అనుమతించారు. బయోమెట్రిక్ అటెండెన్స్‌తో పాటు హాల్ టికెట్, ఐడెంటిటీ ప్రూఫ్ చెక్ చేశారు. ఆభరణాలు ధరించి వచ్చిన విద్యార్థినులను వాటిని తొలగించాకే లోనికి అనుమతించారు. సీసీ కెమెరాల నిఘాలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నీట్ పరీక్ష సాగింది. మొత్తం తొమ్మిది సెంటర్లలో 5,205 మంది విద్యార్థులకు 5087 మంది(97.73 శాతం) పరీక్ష రాసినట్లు నీట్ ఉమ్మడి వరంగల్ సిటీ కోఆర్డినేటర్ సి.మంజులాదేవి తెలిపారు. ఆమె సెంటర్లను సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులతో రావడంతో సెంటర్ల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మండుతున్న ఎండలు, ఉక్కపోతతో కొంత అసౌకర్యానికి గురయ్యారు.



పరీక్ష హాల్‌లోకి వెళ్లే ముందు విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పరీక్ష హాల్‌లోకి వెళ్లే ముందు విద్యార్థి ఇయర్ రింగ్ తొలగిస్తున్న బంధువు



పరీక్ష కేంద్రంలోకి వెళ్లే ముందు విద్యార్థినుల హాల్ టికెట్ పరిశీలిస్తున్న సిబ్బంది

పాంచ్ న్యాయ్‌తో అన్ని వర్గాలకు న్యాయం

- కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య
- నగరంలో పలు చోట్ల కార్నర్ మీటింగ్

హన్మకొండ/కాజీపేట: కాంగ్రెస్ మేనిఫెస్టో పాంచ్ న్యాయ్‌తో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. ఆదివారం హనుమకొండ గోకుల్‌నగర్, హనుమాన్‌నగర్(పెగడపల్లి డబ్బాలు), కాజీపేట చౌరస్తా వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లలో కడియం కావ్య మాట్లాడారు. దేశం అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. తనను మీ బిడ్డగా ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే వరంగల్ మహానగర అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేశాకే ఓట్లడుగుతాం

ప్రజల చిరకాల వాంఛగా మిగిలిపోయిన కాజీపేట బస్టాండ్ ఏర్పాటును నిజం చేసిన తర్వాతే భవిష్యత్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. కాజీపేట ప్రాంత రైల్వే సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందని, ప్రజలు ఆశీర్వదిస్తే కోచ్ ఫ్యాక్టరీతో పాటు డివిజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా శాయశక్తులా పోరాటం చేస్తానన్నారు. ఆయా సమావేశాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీరజాలి, ఎలకంటి రాములు, మాజీ కార్పొరేటర్లు గుంటికుమార్, సుంచు అశోక్, రావుల సదానందం, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అంకూస్, నాయకులు ఆజ్గర్, ఆరూరి సాంబయ్య, పోతుల శ్రీమాన్, గుంటి శ్రీనివాస్, బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, తాడిశెట్టి విద్యాసాగర్, సతీశ్, ఎ.నాగరాజు, నల్ల సత్యనారాయణ, సతీశ్‌యాదవ్, కొండ నాగరాజు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కావ్య

పోలింగ్ సమయం గంట పెంపు

- వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

కాళోజీ సెంటర్: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచుతూ కేంద్ర ఎన్ని కల సంఘం ఉత్తర్వులు జారీ చేసినట్లు వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి చేయాలి

వరంగల్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఈవీఎంల కమిషనింగ్‌ను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని ఈవీఎం గోదాముల్లో జరుగుతున్న ఈవీఎంల కమిషనింగ్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకుడు బండారి స్వాగత్ రణ్‌వీర్‌చంద్‌తో కలిసి కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల ఏఆర్వోలు అశ్వినితానాజీ వాకడే, సిదం దత్తు, తహసీల్దార్లు మహ్మద్‌ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, విజయ్ ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎం, వీవీప్యాట్ల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య

మట్టి మాయగాళ్లు

చెరువు నుంచి అక్రమ తరలింపు

- డయల్ 100 ఫిర్యాదులకు స్పందన కరువు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖలు
- మడికొండ పీఎస్ పరిధిలో ఇష్టారాజ్యం
- రైతులు, ప్రజల గోడు పట్టించుకునేదెవరు?

వరంగల్ క్రైం: చెరువులు.. గుట్టలు పబ్లిక్ ప్రాపర్టీ. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులపై ఉంది. అయితే ఇక్కడ కంచె చేను మేసినట్లు అక్రమార్కులకు సర్కారు అధికారులే వంత పాడడం విడ్డూరంగా ఉంది. మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధి భట్టుపల్లి గ్రామ కోట చెరువులో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రకృతి విధ్వంసంపై పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. వారం రోజులుగా కోటచెరువులో జేసీబీల శబ్దం మార్మోగుతోంది. అర్ధరాత్రి తర్వాత చెరువులోని మట్టిని జేసీబీలతో తీసి ట్రాక్టర్ల ద్వారా కొత్తపల్లి శివారులోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. వ్యాపారులు చేస్తున్న అక్రమ దందాతో ఇబ్బంది పడుతున్న స్థానిక రైతులు, ప్రజలు లిఖిత పూర్వకంగా మడికొండ పోలీసులకు, కాజీపేట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. చెరువు నుంచి నల్ల మట్టిని తీసుకొచ్చి ఇటుక బట్టీల దగ్గర పోసిన రాశులే అక్రమాలకు సజీవ సాక్ష్యం.



కోటచెరువులో అక్రమంగా తీసిన మట్టి



ఇటుక బట్టీల వద్ద కుప్పలుగా పోసిన మట్టి

ఫిర్యాదుదారులపై ఖాకీల కస్సు.. బుస్సు

రాత్రి పూట మట్టిని తరలిస్తున్న క్రమంలో డయల్ 100కు ఫోన్ చేస్తే స్పందించే పరిస్థితి లేకుండా పోయింది. వంద సార్లు ఫోన్ చేసినా ఒక్క కానిస్టేబుల్ కూడా రాలేదని స్థానిక రైతులు చెబుతున్నారు. మట్టి వ్యాపారుల నుంచి మామూళ్లకు అలవాటు పడిన రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించకపోవడమే కాకుండా ఫోన్ చేసిన వారిపై కస్సు.. బుస్సు మంటూ కన్నెర్ర చేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి డయల్ 100 కు వచ్చిన కాల్ ఫోన్ నంబర్లను అక్రమ వ్యాపారులకు చేరవేస్తుండడంతో వ్యాపారులు ఫిర్యాదు దారులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

భక్తులకూ తప్పని నరకం..

భట్టుపల్లి నుంచి కొండపర్తికి వెళ్లే మార్గ మధ్యలో కొత్తపల్లి శివారున ఉన్న ఫణిగల రామలింగేశ్వర స్వామి దేవాలయానికి(రామప్ప) దర్శనం కోసం వచ్చే భక్తులు నిత్యం నరకం చూస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేక దేవాలయం చుట్టూ నాలుగు ఇటుక బట్టీలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే దుమ్ము, పొగతో భక్తులు నరకం చూస్తున్నారు. ఈ విషయంపై చాలా మంది గతంలో పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు.

ఆపడం మా పనికాదు..

మట్టి తరలింపును అడ్డుకోవడానికి ఒక శాఖ ఉంటుంది. సంబంధిత అధికారులు చూసుకోవాలి. వారు మా దగ్గరకు వచ్చి ఫోర్స్ కావాలని అడిగితే ఇస్తాం. అంతే తప్ప మట్టిని తరలిస్తుంటే ఆపడం మా పని కాదు. రైతులు ఫిర్యాదు చేసినా ప్రస్తుతం మేం ఏమీ చేయలేం. ఎందుకంటే ఎన్నికలు ఉన్నాయి. పోలీసులు ఆ విధుల్లో బిజీగా ఉన్నారు. ఎవరైనా సంబంధిత శాఖ అధికారులకే ఫిర్యాదు చేయాలి. పోలీసులు ఎవరైనా మట్టి తరలింపునకు సహకరిస్తామని డబ్బులు తీసుకుంటే చర్యలు తీసుకుంటాం.

– పి.తిరుమల్, కాజీపేట ఏసీపీ

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోంది

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మందా ప్రభాకర్

కాశిబుగ్గ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోంది.. ఇందుకు అన్ని పార్టీలు కంకణం కట్టుకున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. ఆదివారం రాత్రి కాశిబుగ్గ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు 75 ఏళ్లుగా దేశ ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. బీజేపీ దేశాభివృద్ధిని మరిచి మతం పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా దేశాన్ని దోచుకుందే తప్ప.. చేసిందేమీ లేదన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం కాన్షీరాం స్థాపించిన బీఎస్పీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పంజా కల్పనను ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుండాల మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

నిలకడగా శిశువు ఆరోగ్య పరిస్థితి

దామెర: ఊరుగొండ వద్ద దొరికిన ఆడ శిశువు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎంజీఎం వైద్యులు తెలిపారు. ఆదివారం పాప పరిస్థితి ఎలా ఉందని ఎస్సై అశోక్ ఆస్పత్రికి వెళ్లి తెలుసుకున్నారు. వైద్యానికి ఎంత ఖర్చయినా తాను భరిస్తానని జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులను కోరారు. శిశువును విడిచి వెళ్లిన విషయమై అంగన్‌వాడీ టీచర్ విజయ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా కేసు దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని చెప్పారు. పాప తల్లిదండ్రులు ఎక్కడున్నా రావాలని, ఏ సమస్య ఉన్నా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విషయాన్ని గోప్యంగా ఉంచుతామని అన్నారు. పాప తల్లిదండ్రుల వివరాలు తెలిస్తే 88971 57403, 87126 85228, 87126 85020 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై అశోక్ కోరారు.



శిశువు గురించి తెలుసుకుంటున్న ఎస్సై

మీకు తెలుసా?

ఓటు హక్కు.. నాడు కొందరికే..



కాజీపేట : ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పేద, ధనిక అనే తేడా లేకుండా ఓటు హక్కు కల్పిస్తున్నారు. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఉద్యోగులు, అక్షరాస్యులు, భూములున్న వారికే ఓటువేసే అవకాశం ఉండేది. అప్పట్లో మండలాలను ఫిర్కాలుగా పిలిచేవారు. ప్రస్తుత వీఆర్‌ఓకు బదులు నాడు వీఎం (విలేజ్ మేజిస్ట్రేట్) ఉండేవారు. వీరి వద్దే ఓటర్లుగా నమోదు చేసుకునే వారు. ప్రత్యక్ష పద్ధతిలో బహిరంగ సభలో చేతులెత్తి ఓటుహక్కును వినియోగించుకునే వారు. 1952, 1957 ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి ప్రత్యేకంగా ఒక్కో పెట్టె ఏర్పాటు చేశారు. వాటిలోనే ఓటువేసే వారు. తదనంతరం అభ్యర్థులు ఎందరైనా ఒకే పెట్టెలో ఓటు వేసే విధానం వచ్చింది. బ్యాలెట్ ఓటు విధానం అనంతరం ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాలు వినియోగించడం మొదలైంది.

మా అమ్మను గెలిపించండి..

- తల్లి తరఫున తనయుల ప్రచారం..


ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కూతురు, కుమారుడు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత తరఫున ఆమె కూతురు మహతి, కుమారుడు నయన్ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మా అమ్మకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను వారు అభ్యర్థించారు.

ఓటర్లకు అందుబాటులో 'చాట్‌బాట్' యాప్

హన్మకొండ అర్బన్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటర్లకు చాట్‌బాట్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్ ద్వారా వయోవృద్ధులు, దివ్యాంగులు తమ ఓటరు గుర్తింపు కార్డును ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లయితే సంబంధిత పోలింగ్ కేంద్రంతో పాటు అక్కడి సదుపాయాలు తెలుసుకోవచ్చన్నారు. చాట్‌బాట్ యాప్ ద్వారా వీల్‌చైర్ అవసరమైన వయో వృద్ధులు, దివ్యాంగులు అడిగే అవకాశంతో పాటు, దివ్యాంగులకు సైన్ లాంగ్వేజ్‌లో ట్రైనర్స్‌తో వివరిస్తారన్నారు. ఈ యాప్‌ను స్మార్ట్‌ఫోన్ ద్వారా ఉపయోగించుకుని వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. చాట్ బాట్ యాప్‌ను ఓటర్లు సద్వినియోగించుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.



గురుద్వార్‌లో ప్రార్థనలు

నయీంనగర్: హనుమకొండ 6వ డివిజన్ గురుద్వార్‌లో వరంగల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని వేడుకున్నారు.


ప్రార్థన చేస్తున్న సుధీర్‌కుమార్, వినయ్‌భాస్కర్

ఎన్నికలప్పుడే గుర్తొస్తాయి!

ప్రచారాస్త్రాలుగా ఉక్కుపరిశ్రమ, బయ్యారం, తులారాం ప్రాజెక్టులు

- ఎలక్షన్ అనంతరం వాటి ఊసే ఉండదు
- ప్రభుత్వాల పనితీరుపై మండల వాసుల మండిపాటు





బయ్యారం: బయ్యారం ఉక్కు పరిశ్రమ, బయ్యారం, తులారాం ప్రాజెక్టులు.. ఎన్నికలప్పుడే రాజకీయ నాయకులకు గుర్తుకొస్తున్నాయి. అప్పుడే వాటి జపం చేస్తున్నారు. తదనంతరం వాటి ఊసే ఉండడం లేదు. అసెంబ్లీ నుంచి మొదలు.. పార్లమెంట్ వరకు.. ఎన్నికలు ఏవైనా దశాబ్దాల కాలంగా ఈ ప్రాజెక్టులు ప్రచారాస్త్రాలుగా మారుతున్నాయి. ప్రచారంలో భాగంగా ప్రజల వద్దకు వచ్చే నాయకులు తాము గెలిస్తే ఉక్కుపరిశ్రమను నిర్మిస్తామని, బయ్యారం పెద్దచెరువు, తులారాం ప్రాజెక్టు కాల్వలను ఆధునీకరించడంతో పాటు తులారాం ప్రాజెక్టు ఎత్తు పెంచుతామని హామీ ఇచ్చిన, ఇస్తున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఆ హామీలను గతంలో గెలిచిన పార్టీల అభ్యర్థులు అమలు చేయకపోగా మళ్లీ అదే వాగ్దానాలతో ప్రజల వద్దకు వస్తూ ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కేంద్రం ఇవ్వకపోయే.. రాష్ట్రం పెట్టకపోయే..

బయ్యారంలో ఉక్కుపరిశ్రమ నిర్మిస్తామని రాష్ట్ర పునర్విభజనచట్టంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. అయితే ఆ హామీని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అమలు పర్చకపోగా బయ్యారంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు వనరులు లేవని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. ఇదిలా ఉండగా బయ్యారం ఉక్కు.. తెలంగాణ హక్కు.. అనే నినాదంతో ఎన్నికల బరిలో మూడు దఫాలుగా నిలిచిన బీఆర్‌ఎస్.. తన పది సంవత్సరాల పాలనలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. పైగా బయ్యారంలో కేంద్రం ఉక్కుపరిశ్రమను నిర్మించకపోతే తామే నిర్మిస్తామని అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించినప్పటికీ ఆ ప్రకటన మాటలకే పరిమతమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బయ్యారం ఉక్కుపై మళ్లీ పాలక, ప్రతిపక్షాలు బయ్యారంలో ఉక్కుపరిశ్రమ నిర్మిస్తామని హామీలు ఇస్తూనే ఉన్నారు.

నెరవేరని తులారాం ప్రాజెక్టు ఎత్తు హామీ..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని బయ్యారం, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మహబూబాబాద్ మండలాల సరిహద్దులో వట్టేరుపై తులారాం(బి.ఎస్.గుప్తా) ప్రాజెక్టు నిర్మించారు. అయితే ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కుడి, ఎడమ కాల్వలను నిర్మించి రెండు మండలాలకు సాగునీటితో పాటు మహబూబాబాద్‌కు తాగునీరు అందించాలని డిజైన్ చేశారు. ఈ డిజైన్ చెక్‌డ్యాంలా మారడంతో కుడికాల్వ పరిధిలో ఉన్న బయ్యారం మండలంలోని కొన్ని గ్రామాలకు కాల్వ నిర్మించి సాగునీటిని అందిస్తుండగా ఎడమకాల్వ అతిగతి లేకుండా పోయింది. ప్రాజెక్టు రీడిజైన్ చేసి ఎత్తు పెంచుతే కుడి, ఎడమ కాల్వలకు సాగునీటికి ఢోకా ఉండదు. ఈ విషయంపై మహబూబాబాద్ ప్రజాప్రతినిధులు పలుమార్లు రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చినా ఆ హామీ అలాగే మిగిలింది. ఈ ఎన్నికల సందర్భంలోనైనా ప్రచారాస్త్రాలుగా మారిన బయ్యారం ఉక్కుపరిశ్రమ, పెద్దచెరువు, తులారాం ప్రాజెక్టులు అభివృద్ధికి నోచుకుంటాయో లేదో వేచి చూడాల్సిందే.

అభివృద్ధికి నోచుకోని కాకతీయుల వరప్రదాయిని..

కాకతీయ రాణి బయ్యమాంబ నిర్మించిన బయ్యారం పెద్ద చెరువు ద్వారా బయ్యారం, గార్ల మండలాల్లోని వేలాది రైతుల పంట భూములకు నీరందుతుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు నిర్మాణం చేపట్టిన సీతారామప్రాజెక్టు ద్వారా బయ్యారం పెద్దచెరువును రిజర్వాయర్ చేసి పాలేరుకు గ్రావిటీ ద్వారా నీటిని అందిస్తామని అప్పటి సీఎం కేసీఆర్ రోళ్లపాడులో నిర్వహించిన సభలో ప్రకటించారు. అయితే అప్పుడు జిల్లాను రాజకీయంగా ప్రభావితం చేసిన ఓ మంత్రి బయ్యారం చెరువుకు నీరు రానివ్వకుండా డిజైన్‌ను మార్చి పాలేరుకు నీటిని తరలించే కుట్ర చేసి బయ్యారం, గార్ల మండలాల రైతుల ఆశలు ఆవిరిచేశారనే విమర్శలు ఉన్నాయి. మరో వైపు కాల్వలను ఆధునీకరిచకపోవడంతో ఏటా వర్షాకాలంలో ఆయకట్టు చివరిభాగంలోని రైతులకు సాగునీరందక పంటలను ఎండ బెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

మోదీ సభావేదిక పనులు ప్రారంభం

- 8న లక్ష్మీపురానికి రానున్న దేశ ప్రధాని
- పరిశీలించిన కేంద్ర మాజీ మంత్రి రాధాకృష్ణన్


సభావేదిక పనులు ప్రారంభిస్తున్న కేంద్రమాజీ మంత్రి రాధాకృష్ణన్

మామునూరు: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ తిమ్మాపురం రోడ్డు లక్ష్మీపురంలో ఈనెల 8న ప్రధాని మోదీ పాల్గొనే 'విశాల జన మహాసభ' వేదిక పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. సభా స్థలాన్ని బీజేపీ వరంగల్ పార్లమెంట్ ప్రభారి మురళీధర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, కొండేటి శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ జలగం అనితతో కలిసి కేంద్ర మాజీ మంత్రి రాధాకృష్ణన్ పరిశీలించారు. అనంతరం మోదీ సభ ఆటంకాలు లేకుండా జరగాలని ప్రాంగణంలోని గణపతి, శివాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాధాకృష్ణన్ కొబ్బరికాయలు కొట్టి సభావేదిక పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌పీజీ అధికారుల సూచనల ప్రకారం సభావేదిక పనులు జరుగుతున్నాయని, మోదీ సభకు లక్ష మందికి పైగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మల్లాడి తిరుపతిరెడ్డి, జలగం రంజిత్‌రావు, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సాంబయ్యయాదవ్, అర్చన, మల్లాడి రాంరెడ్డి, రమేష్, ముప్ప సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించాలి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


నెహ్రూసెంటర్: అభివాదం చేస్తున్న మంత్రి తుమ్మల, సీపీఎం నేతలు

నెహ్రూసెంటర్: దేశ సమగ్రాభివృద్ధి, పరిరక్షణ, సంక్షేమం కోసం ఇండియా కూటమిని (కాంగ్రెస్) గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో ఎన్నికల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ఎత్తుగడలను ఎండగట్టాలన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు పేదలు, పెట్టుబడిదారులకు, మంచికి, చెడుకు మధ్య జరుగుతున్న పోరాటమని, ఈ పోరాటంపై ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభమైందని, ఇందులో ఇండియా కూటమి తప్పక గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోసం కృషి చేయాలని, అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్న బీజేపీని గద్దె దించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, మండ రాజన్న, బానోత్ సీతారాంనాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, కుర్ర మహేష్, దుడ్డెల రామ్మూర్తి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలి..

మరిపెడ రూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మరిపెడ మండలం గాలివారిగూడెం స్టేజీ ఏఎన్నార్ గార్డెన్‌లో నిర్వహించిన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బలరాం నాయక్‌ను గెలిపించి తీరాలన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ కార్యకర్తల అండతో అనకొండ లాంటి రెడ్యానాయక్‌ను ఓడించామన్నారు. అదే స్ఫూర్తితో సూర్యకాంతంలాంటి కవితను చిత్తుగా ఓడించి బలరాంనాయక్‌ను గెలిపించాలన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ఇసుక, బియ్యం, బెల్లం దందా చేసి కోట్లు కొల్లగొట్టిన రెడ్యానాయక్‌ను ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. అదే తరహాలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కవితను ఓడించి బలరాంనాయక్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, అంబటి వీరభద్రం, వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, కమలాకర్, తాజుద్దీన్, బండి శ్రీనివాస్, సోమిరెడ్డి, కోట వెంకట్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, జగదీష్, మారబోయిన వెంకన్న, లూనావత్ వెంకన్న, డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

వారికి రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం..

- హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- ప్రజలపై ధరల భారం మోపిన బీజేపీ
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు


రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు


రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఎల్కతుర్తి: కాంగ్రెస్, బీజేపీ నాయకులకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం.. ప్రజల బాగోగులు పట్టించుకోరని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఈనెల 13న జరుగబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రజల తలరాతలు మారుస్తాయన్నారు. వందరోజుల్లో ఆరుగ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఒక్క బస్సు ప్రయాణం తప్ప అన్ని హామీలు విస్మరించిందని మండిపడ్డారు. ఆరు వాగ్దానాల్లో ఐదు నెరవేర్చామని తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బీఆర్‌ఎస్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలన్నీ గల్లంతయ్యాయన్నారు. ప్రజలు మార్పు కోరుకున్నది ఇందుకేనా.? అని నిలదీశారు. కరీంనగర్ ఎంపీగా కొనసాగిన బండి సంజయ్ జిల్లాలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. బీజేపీ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచడంతో పాటు జీఎస్టీ భారం మోపి ప్రజల నడ్డివిరిచిందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నన్ని రోజులు ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కష్టాలు మొదలయ్యాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఝూఠా మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ మాట్లాడుతూ బండి సంజయ్ కరీంనగర్ ఎంపీగా చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. దేవుళ్ల పేరు అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ జక్కుల అనితారమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మండల సురేందర్, నాయకులు సంగ సంపత్, మారుపాటి మహేందర్‌రెడ్డి, ఏనుగు సత్యవతి, అప్పని పద్మ, సదానందం పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు నేడు వ్యాక్సినేషన్

న్యూశాయంపేట : వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధి హజ్ యాత్రకు వెళ్లే వారికి నేడు(సోమవారం) రెండో విడత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హజ్ కమిటీ వ్యాక్సినేషన్ క్యాంప్స్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ అనీస్ సిద్ధిఖీ, సర్వర్ మోహియొద్దీన్ ఘాజీ ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఐఎంఏ హాల్‌లో ఉదయం 9 గంటలకు వైద్య శాఖ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా జిల్లాల పరిధి యాత్రీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీఆర్‌సీ వేతన సవరణ అంశాలపై వివరణ

హన్మకొండ అర్బన్ : హైదరాబాద్‌లోని పీఆర్‌సీ కార్యాలయంలో పీఆర్‌సీ(పే రివిజన్ కమిషన్) కమిటీ సభ్యులను కలిసి వేతన సవరణ అంశాలపై తగిన సూచనలు చేసినట్లు తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్‌ఎస్‌ఓఎస్‌ఏ) ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కనిష్ట వేతనం రూ.32 వేలు, గరిష్ట వేతనం రూ.2.95 లక్షలు, ఐదు స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్స్, ఫిట్‌మెంట్ 45 శాతం, నోషనల్ లేని మోనిటరీ బెనిఫిట్లను వాయిదాలో కాకుండా ఒకేసారి చెల్లించాలని సూచించారు. హెచ్‌ఆర్‌ఏను మున్సిపాలిటీలో 20 శాతం, గ్రేటర్ మున్సిపాలిటీలో 25 శాతం, మెట్రోపాలిటన్ నగరంలో 30 శాతం చెల్లించాలని వివరించారు. ఉద్యోగులు మరణిస్తే అంత్యక్రియలకు కనీసం రూ.30 వేలు లేదా ఒక నెల మూలవేతనం చెల్లించాలని, ఉద్యోగితో పాటు డిపెండెంట్లకు కూడా ఇది వర్తింపజేయాలని తెలిపారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బదులు ఉద్యోగి మూలవేతనంలో సగం మించి ఎంతైనా ప్రభుత్వమే భరించాలని, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను మార్చాలని విన్నవించినట్లు తెలిపారు. టీఎస్‌ఎస్‌ఓఎస్ గౌరవ అధ్యక్షుడు ఇమ్మడి జ్యోతిరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లేశం పాల్గొన్నారు.

శ్రీరాముడి మార్గం ఆదర్శం



హన్మకొండ కల్చరల్: శ్రీరాముడు చూపిన మార్గం దేశ ప్రజలకు ఆదర్శమని జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నయీంనగర్ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్న శ్రీరాముడిపై సదస్సు ఆదివారం ముగిసింది. కేయూ విశ్రాంత ఆచార్యులు మాడభూషి రాజగోపాలచార్య అధ్యక్షతన జరిగిన మొదటి సమావేశంలో ముఖ్య అతిథిగా పేషనలిస్ట్ హబ్ సీఈవో సాయి, వక్తగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని 'శ్రీరాముడు జాతీయ మహా పురుషుడు' అంశంపై ప్రసంగించారు. కేయూ విశ్రాంత ఆచార్యులు చిలకమారి సంజీవ అధ్యక్షతన జరిగిన రెండో సమావేశంలో ముఖ్య అతిథిగా తుషార మురళీధర్, వక్తగా మావుడూరి సూర్యనారాయణమూర్తి పాల్గొని 'శ్రీరాముడు-మర్యాద పురుషోత్తముడు' అంశంపై ప్రసంగించారు. మండలి కన్వీనర్ సౌమిత్రి లక్ష్మణాచార్య అధ్యక్షతన జరిగిన మూడో సమావేశంలో ప్రముఖ రచయిత పిడియాట్రిక్ సర్జన్ డాక్టర్ పింగళి గోపాల్, రచయి త పంకజ్ సక్సేనా వక్తగా పాల్గొని 'శ్రీరామ చేతన-ద సివిలైజేషనల్ యూనిఫైర్' అంశంపై, కేయూ విశ్రాంత ఆచార్యులు కొక్కొండ విజయబాబు అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో మాతంగి రమేశ్‌బాబు, సహృదయ సంస్థ జిల్లా అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు వక్తగా పాల్గొని 'శ్రీరామాయణం-జాతీయ గ్రంథం' అంశంపై ప్రసంగించారు. కృష్ణమూర్తి, తాడిచెర్ల రవి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.సంధ్య

ఎంజీఎం : వైద్యులు నూతన చికిత్స విధానాలను తెలుసుకొని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సంధ్య అన్నారు. ఆదివారం ఐఎంఏ హాల్‌లో ఐఎంఏ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో 'గుండె వ్యాధులు-నూతన చికిత్స విధానాలు' అనే అంశంపై కంటిన్యూయింగ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ (సీపీడీ) కార్యక్రమం నిర్వహించినట్లు ఆ శాఖ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎస్.సంధ్య హాజరై మాట్లాడారు. ఇలాంటి సీపీడీ కార్యక్రమాలు యువ వైద్యులు, మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లకు చాలా అవసరమన్నారు. అనంతరం పలువురు ప్రముఖ గుండె వైద్య నిపుణులు అందుబాటులోకి వచ్చిన నూతన వైద్య చికిత్స విధానాలను వైద్యులకు బోధించారు. ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ అశోక్‌రెడ్డి, హరి సంధ్యారాణి, ఐఎంఏ వరంగల్ కార్యదర్శి బింగి శ్రీనివాస్, కోశాధికారి దిడ్డి శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, రామకృష్ణ, సీనియర్ వైద్యులు, పీజీ వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు, ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యులు పాల్గొన్నారు.

నేటినుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు

- మూడు ఉమ్మడి జిల్లాల్లో 123 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 1,71,115 మంది విద్యార్థులు




కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ కోర్సుల 2వ, ఆరో సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 6 నుంచి, నాల్గవ సెమిస్టర్ల పరీక్షలు 7 నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి ఆదివారం తెలిపారు. 2వ సెమిస్టర్ల పరీక్షలు 6, 8, 10, 16, 18, 21, 25, 29 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 7, 9, 15, 17, 20, 22, 28, 30 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరో సెమిస్టర్ పరీక్షలు 6, 8, 10, 16, 18, 21, 25, 29, 31, జూన్ 7, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయి. రెండో సెమిస్టర్ పరీక్షలకు 68,139, నాలుగో సెమిస్టర్‌కు 56,899, ఆరో సెమిస్టర్‌కు 46,077 మొత్తం 1,71,115 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు ఉమ్మడి వరంగల్‌లో 44, ఉమ్మడి ఖమ్మంలో 30, ఉమ్మడి ఆదిలాబాద్‌లో 49 మొత్తం 123 సెంటర్లు ఏర్పాటు చేసి 123 మంది చీఫ్‌సూపరింటెండెంట్లను నియమించారు. ఒక్కో సెంటర్‌కు ఒక అబ్జర్వర్, వర్సిటీ పరిధిలో పది ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్లు కళాశాలల వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని, కళాశాలల నుంచి పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అక్రమ మద్యం అమ్ముతున్న ఇద్దరి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

రామన్నపేట : అక్రమ మద్యం అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. నగరంలోని మట్టెవాడ పీఎస్ పరిధిలోని మట్టెవాడ తుమ్మలకుంటకు చెందిన వన్నాల సునీత, వన్నాల సంధ్య ఇంట్లోనే బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం అమ్ముతున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి రూ.11,730 మద్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి తదుపరి చర్యల నిమిత్తం మట్టెవాడ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్లు ఎస్.రవికుమార్, ఏఎస్సై కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో పీఎస్ మృతి


మహేష్ (ఫైల్)

హసన్‌పర్తి: బైక్ అదుపు తప్పిన ఘటనలో పంచాయతీ కార్యదర్శి (పీఎస్) మృతిచెందాడు. ఈ ఘటన ఉనికిచర్ల-వడ్డేపల్లి మార్గమధ్యలోని సుబ్బయ్యపల్లి సమీపంలో జరిగింది. ఆత్మకూరు మండలానికి చెందిన నాగపురి మహేష్(45) ధర్మసాగర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గోపాలపురంలోని విష్ణుపురి కాలనీలో ఉంటూ రోజూ ధర్మసాగర్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ధర్మసాగర్ వెళ్లి సాయంత్రం బైక్‌పై ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలోని సుబ్బయ్యపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మహేష్ అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

దాబా పైనుంచి పడి యువకుడి దుర్మరణం


కుమార్(ఫైల్)


విచారణ చేస్తున్న పోలీసులు

నెక్కొండ : నిద్రమత్తులో బిల్డింగ్ మెట్లు దిగుతూ..ప్రమాదవశాత్తు పైనుంచి పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండలోని వరంగల్ రోడ్డులో గల అశ్విని బిర్యానీ పాయింట్‌లో చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన దాసరి కుమార్(34) వేయిటర్‌గా పని చేస్తున్నాడు. కాగా రాత్రి వరకు పని ఉండడంతో ఇంటికి వెళ్లకుండా అక్కడే డాబాపై నిద్రిస్తున్నాడు. శనివారం రాత్రి యజమాని సైతం బిర్యానీ పాయింట్‌ను మూసేసి ఇంటికి వెళ్లారు. కాగా రాత్రి సమయంలో కుమార్ మూత్రవిసర్జన కోసం డాబా నుంచి దిగుతున్న క్రమంలో మెట్లపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడగా షెటర్, గేటు తగిలింది. దీంతో కుమార్ తలకు, ముఖం ముందు భాగంలో తీవ్ర గాయాలై రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఆదివారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో శవ పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

బాహుబలుల బరి!

మామాజీ, దిగ్గీ రాజా, సింధియాల గురి | మధ్యప్రదేశ్‌లో 9 చోట్ల 7న పోలింగ్ | అన్నీ కమలనాథుల సిట్టింగ్ స్థానాలే | ఈసారి కొన్నింట కాంగ్రెస్ గట్టి పోటీ

వారిద్దరూ మాజీ సీఎంలు. ఒకరు రాష్ట్రంలో, మరొకరు కేంద్రంలోనూ చక్రం తిప్పిన ఉద్దండులు. సుదీర్ఘకాలం తర్వాత లోక్‌సభ బరిలో దిగారు. వీరికి తోడు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా. ఇలా పలువురు కీలకమైన నేతల పోటీకి మధ్యప్రదేశ్‌లో మూడో విడత ఎన్నికలు వేదికగా మారాయి. రాష్ట్రంలోని 9 లోక్‌సభ స్థానాలకు 7న పోలింగ్ జరగనుంది. 2019 ఎన్నికల్లో వీటన్నింటిలోనూ కమలమే విరబూసింది. ఈసారి పలు స్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీయే ఇస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని కీలక స్థానాలపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్



సింధియా, చౌహాన్, దిగ్విజయ్, అలోక్‌సింగ్, సంధ్యా రాయ్, సికర్‌వార్

విదిశ

మధ్యప్రదేశ్‌కు సుదీర్ఘకాలం సీఎంగా ఉన్న బీజేపీ దిగ్గజం శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభ బాట పట్టారు. విదిశ ఓటర్లకు ఆయన కొత్తేమీ కాదు. 1996, 1998, 1999, 2004 ఎన్నికల్లో ఇక్కడి నుంచి వరుసగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. మొత్తమ్మీద ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచారు. నియోజకవర్గ ప్రజలు చౌహాన్‌ను ఆప్యాయంగా మామాజీ అని పిలుచుకుంటారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్ భాను శర్మతో పోలిస్తే ఆయనకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 1991లో వాజ్‌పేయినీ లోక్‌సభకు పంపిన చరిత్ర విదిశకు ఉంది. 2009, 2014 ఎన్నికల్లో బీజేపీ దిగ్గజం సుష్మా స్వరాజ్ కూడా ఇక్కడి నుంచి గెలిచారు.

రాజ్‌గఢ్

మాజీ సీఎం, కాంగ్రెస్ కీలక నేత దిగ్విజయ్ సింగ్ పోటీలో ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక్కడి ప్రజలు గత రెండు ఎన్నికలుగా బీజేపీనే గెలిపిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లోనూ బీజేపీ నుంచి రోడ్మల్ నాగర్ ఇక్కడ బంపర్ మెజారిటీతో విజయం సాధించారు. 2014లో 2.28 లక్షల మెజారిటీ సాధించగా 2019లో 4.31 లక్షలకు పెంచుకున్నారు. ఈసారీ బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. అభిమానులు దిగ్గీ రాజా అని పిలుచుకునే దిగ్విజయ్ ఏకంగా 30 ఏళ్ల తర్వాత ఇక్కడ పోటీకి దిగుతుండటం విశేషం. ఆయన సోదరుడు లక్ష్మణ్ సింగ్ ఇక్కడ ఐదుసార్లు గెలిచారు లక్ష్మణ్ సింగ్ 2004లో బీజేపీ టికెట్‌పైనా గెలవడం విశేషం!

వీటికి ఎన్నిక

మొరేనా, భిండ్, గ్వాలియర్, గుణ, సాగర్, విదిశ, భోపాల్, రాజ్‌గఢ్, బేతూల్ (ఇక్కడ రెండో విడతలోనే పోలింగ్ జరగాల్సింది. బీఎస్పీ అభ్యర్థి మృతితో మూడో విడతకు వాయిదా వేశారు)

భోపాల్

వివాదాస్పద బీజేపీ నాయకురాలు సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. 2019లో మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్‌ను ఆమె ఏకంగా 3.64 లక్షల ఓట్ల ఆధిక్యంతో మట్టి కరిపించి సంచలనం సృష్టించారు. అయినా వివాదాస్పదురాలిగా పేరుపడ్డ సాధ్వికి బీజేపీ ఈసారి టికెటివ్వకపోవడం విశేషం! భోపాల్ 1989 నుంచీ బీజేపీ కంచుకోటగా కొనసాగుతోంది. 1999లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం ఉమా భారతి ఇక్కడ గెలిచారు. 2004, 2009ల్లో కైలాష్ చంద్రజోషి విజయం సొంతం చేసుకున్నారు. ఇలా అభ్యర్థులు మారుతున్నా బీజేపీనే ఓటర్లు దీవిస్తున్నారు. ఈసారి ఆ పార్టీ నుంచి అలోక్ శర్మ, కాంగ్రెస్ నుంచి అరుణ్ శ్రీవాస్తవ్ బరిలో ఉన్నారు.

మొరేనా

ఇక్కడ 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రామ్‌నివాస్ రావత్‌ను బీజేపీ అభ్యర్థి నరేంద్రసింగ్ తోమర్ 1.13 లక్షల ఓట్ల వ్యత్యాసంతో ఓడించారు. తోమర్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. బీజేపీ నుంచి శివమంగళ్ సింగ్ తోమర్, కాంగ్రెస్ నుంచి సత్యపాల్ సింగ్ సికర్‌వార్ పోటీ చేస్తున్నారు. 1996 నుంచి ఇక్కడ బీజేపీదే విజయం. 1996, 1998, 1999, 2004ల్లో అశోక్ అర్గల్, 2009లో నరేంద్రసింగ్ తోమర్ గెలిచారు. ఇది సురక్షిత స్థావరమనే ధీమాతో ఇప్పటిదాకా పెద్ద ఎన్నికలను ఎదుర్కోని శివమంగళ్‌ను బీజేపీ పోటీకి పెట్టింది. ఇక్కడ అభ్యర్థిని మార్చడం ఆ పార్టీకి ఇది వరుసగా మూడోసారి! కాంగ్రెస్ అభ్యర్థి సికర్‌వార్ మాజీ బీజేపీ నేతే. మొరేనాలో బ్రాహ్మణ, రాజ్‌పుత్ ఓట్లు రెండేసి లక్షల చొప్పున ఉన్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ సీట్లకు కాంగ్రెస్ ఏకంగా ఐదింట్లో గెలవడంతో ఈసారి ఫలితంపై ఆసక్తి పెరిగింది.

గుణ

ఇది సింధియాల కోట. మూడో విడతలో దేశవ్యాప్తంగా బాగా ఆసక్తి నెలకొన్న స్థానాల్లో ఒకటి. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా 2002 నుంచి 2019 దాకా ఈ స్థానానికి కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. మారిన రాజకీయ పరిణామాల్లో ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. ఆయనతో కాంగ్రెస్ నేత రావు యాదవేంద్రసింగ్ యాదవ్ పోటీ పడుతున్నారు. 2019లో ఇక్కడ బీజేపీ నేత కృష్ణపాల్ సింగ్ యాదవ్ చేతిలో జ్యోతిరాదిత్య ఓటమి చవిచూశారు! 1957లో ఇక్కడ జ్యోతిరాదిత్య నానమ్మ విజయరాజే సింధియా గెలిచారు. 1971లో ఆమె కుమారుడు, జ్యోతిరాదిత్య తండ్రి దివంగత మాధవ్‌రావు సింధియా భారతీయ జన్‌సంఘ్ తరఫున ఇక్కడ నెగ్గారు.

భిండ్

చంబల్ ప్రాంతంలో ఉన్న ఈ స్థానంలో ఆది నుంచి బీజేపీదే ఆధిపత్యం. 2008లో ఎస్సీలకు రిజర్వ్ అయిన తర్వాత కూడా వరుసగా మూడు ఎన్నికల్లోనూ ఆ పార్టీయే గెలిచింది. కాంగ్రెస్ నుంచి ఫూల్‌సింగ్ బారియా, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సంధ్యా రాయ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 1971లో విజయరాజె సింధియా కాంగ్రెస్ నుంచి నెగ్గారు. భిండ్‌లో కూడా బ్రాహ్మణ, క్షత్రియ ఓట్లు కలిపి ఆరు లక్షలకు పైనే ఉన్నాయి.

విస్తృత ప్రచారం

మధ్యప్రదేశ్‌లో మూడో విడత స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. రెండు పార్టీల అగ్ర నేతలు కూడా ఇప్పటికే సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంక పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. తన తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం బలిదానం చేశారంటూ మొరెనాలో ప్రియాంక భావోద్వేగపూరితంగా మాట్లాడారు. బీజేపీ నుంచి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా మొరేనా, బేతూల్, రాజ్‌గఢ్‌ల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. కులం, నిరుద్యోగం, పేదరికం, వలసలు మూడో విడత స్థానాల్లో బాగా ప్రభావం చూపే అంశాలు.

ఎన్నికల రంగోలి!

ఎన్నికల్లో ఓటింగ్ పెంచేందుకు ఎన్నికల సంఘం ఎన్నో వినూత్నమైన చర్యలు చేపడుతోంది. అహ్మదాబాద్ ఎన్నికల అధికారులు కొంచెం భిన్నంగా ఆలోచించారు. 'మీ విలువైన ఓటుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి' అన్న పిలుపు కంటే ఓటు ప్రాధాన్యతను కళాత్మకంగా చెబితే మనసులో బాగా నాటుకుంటుందని భావించారు. స్థానిక అల్ఫా వన్ మాల్ ఆవరణలో ఏకంగా 12 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో ఓటుపై అవగాహన కల్పించే రంగోలీ రూపొందించారు. ఇందుకు 350 కిలోల రంగులు వినియోగించారు. 18 గంటల సమయం పట్టిందట. ప్రజలను ఓటు దిశగా ప్రోత్సహించి, అహ్మదాబాద్‌ను అత్యధిక ఓటింగ్ నమోదైన ప్రాంతంగా చేయడమే తమ ఉద్దేశమని నోడల్ ఆఫీసర్ యోగేశ్ పరేఖ్ అంటున్నారు. మాల్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఈ ఆర్ట్ తెగ ఆకర్షిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్





శాంభవీ చౌదరి.. యంగెస్ట్ క్యాండిడేట్!

బిహార్‌లోని సమస్తిపూర్ నుంచి ఎల్‌జేపీ అభ్యర్థిగా లోక్‌సభ బరిలో

శాంభవీ చౌదరి. ఈ లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నవారిలో అత్యంత చిన్నవయస్కురాలు. 25 ఏళ్ల శాంభవి బిహార్ మంత్రి అశోక్ చౌదరి కుమార్తె. లేడీ శ్రీరామ్ కాలేజీలో డిగ్రీ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ చేశారు. బిహార్‌లోని మగధ్ వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అభ్యర్థిగా సమస్తిపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

రాజకీయ కుటుంబంలో పుట్టిపెరగడంతో శాంభవికి సహజంగానే రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. తొలుత చదువుకే ప్రాధాన్యమిచ్చారు. బిహార్‌లో దేవాలయాల్లో దళిత పూజారులను నియమించిన మాజీ ఐపీఎస్ అధికారి ఆచార్య కిషోర్ కునాల్ కుమారుడు సాయన్ కునాల్‌ను పెళ్లాడారు. అత్తగారి ఊరైన సమస్తిపూర్ నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు. పైగా తండ్రి పార్టీ అయిన జేడీ(యూ)ను కాదని చిరాగ్ పార్టీలో చేరడం విశేషం! అది తన సొంత రాజకీయ నిర్ణయం అంటారామె. బిహార్‌కు, బిహారీలకు తొలి ప్రాధాన్యమిచ్చే చిరాగ్ విజన్ నచ్చి ఎల్‌జేపీలో చేరానంటారు. ''చిరాగ్ భయ్యా విజన్‌కు ఆకర్షితురాలినయ్యాను. ఎందుకంటే నేను ఢిల్లీ వర్సిటీలో చదివేటప్పుడు 'మీరు బీహారీలా కనిపించడం లే'దని ప్రొఫెసర్లు అనేవారు. బిహారీలా కనిపించకపోవడం, దళితురాలిగా కనిపించకపోవడం ఏమిటా అని ఎప్పుడూ ఆలోచించేదాన్ని. అది నాపై తీవ్ర ప్రభావం చూపింది'' అంటారు శాంభవి. ''సమస్తిపూర్‌లో విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన నా తొలి ప్రాథమ్యాలు. వచ్చే ఐదేళ్లలో రాబోయే తరాల కోసం సరికొత్త సమస్తిపూర్‌ను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా'' అని వివరించారు. కాంగ్రెస్‌తో స్థానికంగా యాదవ, ముస్లిం, ఓబీసీ ఓటు బ్యాంకు అధికంగా ఉన్నా తన ఎస్సీ నేపథ్యం, భర్త ఓబీసీ నేపథ్యం కలిసొస్తాయని ధీమాతో ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

తొలి రెండు దశల్లోనూ...

తగ్గిన మహిళా ఓటింగ్

పురుషులతో పోలిస్తే పలు రాష్ట్రాల్లో భారీ అంతరం

మహిళలు ఆకాశంలో సగం. అవకాశాల్లో అంతకంటే ఎక్కువే. అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానం. ఓటర్లపరంగా చూస్తే పలు రాష్ట్రాల్లో పురుషుల కంటే ఎక్కువే. అందుకే పార్టీలన్నీ తమ మేనిఫెస్టోల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నాయి. చాలా రాష్ట్రాల్లో మహిళల కోసం ప్రత్యేక పథకాలు పుట్టుకొస్తున్నాయి. కర్నాటకలో, తాజాగా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల జయాపజయాల్ని నిర్దేశించింది ఈ మహిళా పథకాలే! అయితే ఎందుకో గానీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మహిళల్లో 'ఓటు ఉత్సాహం' లోపిస్తోంది. ఇప్పటిదాకా జరిగిన రెండు విడతల పోలింగ్‌లో మహిళల ఓటింగ్ శాతం తగ్గినట్టు కేంద్ర ఎన్నికల సంఘం తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది మంచి పరిణామం కాదంటున్నారు విశ్లేషకులు...

– సాక్షి, నేషనల్ డెస్క్



లోక్‌సభ ఎన్నికల తొలి రెండు విడతల పోలింగ్‌ను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మహిళల ఓటింగ్ శాతంలో తగ్గుదల నమోదైంది. 2019తో పోల్చి చూసినప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి దాకా రెండు విడతల్లో ఓటు వేసిన మహిళల శాతం 0.8 శాతం మేర తగ్గింది. 2019లో తొలి రెండు విడతలతో పోలిస్తే ఈసారి మొత్తమ్మీద (స్త్రీ, పురుషులు) 3.3 శాతం దాకా తక్కువ ఓటింగ్ నమోదైంది. ఈ ఏడాది తొలి విడతలో దశలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో మొదటి దశలో 69.4 శాతం, రెండో దశలో 69.6 శాతం ఓటింగ్ నమోదైంది.

ఇక్కడ దయనీయం

గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే నాగాలాండ్ లోక్‌సభ స్థానంలో ఈసారి రికార్డు స్థాయిలో మహిళల ఓటింగ్ ఏకంగా 24.79 శాతం తగ్గిపోయింది! మొత్తమ్మీద కూడా అక్కడ చాలా తక్కువ ఓటింగ్ నమోదైంది. మహిళల ఓటింగ్ సిద్ధీ లోక్‌సభ స్థానంలో 13 శాతం, మథురలో 13 శాతం, రేవా, పథనంతిట్టల్లో 12 శాతం, ముజఫర్‌నగర్, ఖజురహోల్లో 11 శాతం తగ్గింది. కొట్టాయం, ఇడుక్కి, రాంపూర్, సత్నా, భాగ్‌పత్‌ల్లో 10 శాతం, వయనాడ్‌లో 7 శాతం, బెంగళూరు రూరల్‌లో 7 శాతం, ఔరంగాబాద్‌లో 5 శాతం, ఝుంఝునూలో 9 శాతం, షిల్లాంగ్‌లో 8 శాతం చొప్పున మహిళల ఓటింగ్ తగ్గింది. మొత్తం మీద చూస్తే 14 లోక్‌సభ స్థానాల్లో 10 నుంచి 20 శాతం మధ్య, 59 చోట్ల 5–10 శాతం, 80 చోట్ల 0–5 శాతం ఓటింగ్ తగ్గిపోయింది. ఛత్తీస్‌గఢ్, కర్నాటక, త్రిపుర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, అండమాన్ నికోబార్, రాజస్థాన్, మిజోరం, యూపీల్లో మహిళల ఓటింగ్ బాగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

ఇక్కడ నయం

రెండు దశల్లో ఎన్నికలకు వెళ్లిన నియోజకవర్గాల్లో 34 చోట్ల మాత్రం మహిళల ఓటింగ్ 0–5 శాతం మధ్య పెరిగింది. ఒక స్థానంలో ఇది మరింత ఎక్కువగా నమోదైంది. లక్షద్వీప్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర స్థానాల్లో 80 శాతం మహిళలు ఉత్సాహంగా ఓటు వేయడం ప్రోత్సాహనీయం. బీహార్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, తమిళనాడు, కేరళ, మేఘాలయ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ, పుదుచ్చేరిలోనూ పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల తొలి రెండు దశల్లో రాష్ట్రాలవారీగా పోలింగ్ శాతం

రాష్ట్రం/యూటీ	మహిళల ఓటింగ్	పురుషుల ఓటింగ్
లక్షద్వీప్	85.5	82.9
త్రిపుర	80.6	81.3
సిక్కిం	79.8	79.9
అసోం	79.6	79
పుదుచ్చేరి	79.1	78.6
పశ్చిమబెంగాల్	80.3	78.3
మణిపూర్	79	77.9
అరుణాచల్‌ప్రదేశ్	80.6	76.3
మేఘాలయ	79.7	75.4
ఛత్తీస్‌గఢ్	73.5	75
కర్నాటక	71.1	71.5
కేరళ	71.7	70.6
తమిళనాడు	70.2	69.8
జమ్మూకశ్మీర్	71	69.6
మహారాష్ట్ర	60.7	65.9
మధ్యప్రదేశ్	61.3	65.3
అండమాన్	63.8	64.4
రాజస్థాన్	60.5	62.2
ఉత్తరప్రదేశ్	56.7	56.9
మిజోరం	55.7	58.1
నాగాలాండ్	57.9	57.5
ఉత్తరాఖండ్	58	54.5
బిహార్	56	53.2

ప్రస్తుత ఎన్నికల వరకే చూస్తే మొత్తం మీద స్త్రీ పురుషుల ఓటింగ్ మధ్య పెద్ద వ్యత్యాసం కనిపించడం లేదు. తొలి విడతలో మహిళల ఓటింగ్ 66.1 శాతం, పురుషుల ఓటింగ్ 66.2 శాతం నమోదైంది. రెండో విడతలో 66.4, 67 శాతంగా ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే మాత్రం తేడా బాగానే ఉంది.

మంచి పరిణామం కాదు

మహిళలు మరింతగా ముందుకొచ్చి ఓటు వేస్తేనే నేతలకు, పార్టీలకు, ప్రభుత్వాలకు స్పష్టమైన సందేశం సాధ్యమని విశ్లేషకులు అంటున్నారు. మిగతా ఐదు విడతల పోలింగ్‌లోనూ మహిళల అనాసక్తి ఇలాగే కొనసాగితే అది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. మహిళా ఓటర్ల మనసు గెలిచేందుకు పార్టీలు మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయన్న అభిప్రాయమూ ఉంది.

సంయుక్త... మంత్రిగారి అమ్మాయి

పుస్తకాల పురుగు



పరిచయం

సంయుక్తా పాటిల్. మంచి ఫుడీ. అంతకు మించి పుస్తకాల పురుగు. మంచి పుస్తకం దొరికిందంటే దాన్ని పూర్తి చేసేవరకు నిద్రపోరు. బసవేశ్వరుని భక్తురాలు. కర్నాటక వ్యవసాయ మంత్రి శివానంద్ పాటిల్ కూతురైన సంయుక్త బీజాపూర్ గ్రామీణ మహిళల సాధికారత కోసం కృషి చేస్తున్నారు. జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా వారి ఆర్థిక స్వావలంబన కోసం పాటుపడుతున్నారు. బాగల్‌కోట్ నుంచి తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగారు. నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన బీజేపీ సీనియర్ నేత పీసీ గద్దిగౌడర్‌తో కాంగ్రెస్ తరఫున తలపడుతున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

క్షేత్రస్థాయిలో..

30 ఏళ్ల సంయుక్త క్రైస్ట్ యూనివర్సిటీ లా స్కూల్లో న్యాయ శాస్త్రం చదివారు. తండ్రి రాజకీయాలను చూస్తూ ఎదిగారు. విద్యార్థిగా ఎన్ఎస్‌యూఐలో పని చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా అత్యధిక ఓట్లతో గెలిచారు. మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా ప్రజల మనసులను గెలుచుకున్నారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజలతో మమేకమై ఉండాలన్న పాఠాన్ని తండ్రి నుంచి నేర్చుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సంక్షేమానికి పని చేయాలన్న తండ్రి సూచన మేరకు 2017లో స్పర్శ్ ఫౌండేషన్ ప్రారంభించారు. ఇది గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం పనిచేస్తుంది. పాలసీలు సమాజంలోని అట్టడుగు వ్యక్తులకు చేరినప్పుడే అవి విజయం సాధించినట్లని సంయుక్త నమ్ముతారు. సాయంకాలాల్లో గ్రామాల్లోని ప్రజలను కలవడానికే ఇష్టపడతారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బసవనబాగేవాడి నియోజకవర్గంలో తండ్రి ప్రచారమంతా తానై నిర్వహించారు. అయితే ఎన్నికల ప్లానింగ్ ఒకెత్తు. నేరుగా పోటీ చేయడం మరో ఎత్తు. విద్యార్థి, యువజన సంఘాల ఎన్నికల అనుభవం తనకిప్పుడు ఉపయోగపడుతుందంటారామె. కొత్త పరిశ్రమలు, పర్యాటకాభివృద్ధి, బాగల్‌కోట్–కుడచి పెండింగ్ రైల్వే లైన్ పరిపూర్తి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. వ్యవసాయాధారిత బాగల్‌కోట్ ప్రాంతం రెండు కరువులను ఎదుర్కొంది. ''అందుకే నీటి పారుదలపై దృష్టి పెడతా. ప్రజల గొంతుకగా మారతా'' అంటున్నారు.

బీజేపీకి గట్టి సమాధానం..

వారసత్వ రాజకీయాలపై బీజేపీ విమర్శలను సంయుక్త తేలిగ్గా తీసిపారేస్తారు. ''తల్లిదండ్రుల నేపథ్యం వల్ల రాజకీయాల్లోకి ఎంట్రీ సులభం అవుతుంది. కానీ చివరికి ప్రజలే నిర్ణేతలు. వాళ్లు అంగీకరించకపోతే ఎంతటి నేతల పిల్లలయినా రాజకీయాల్లో రాణించలేరు'' అన్నది ఆమె వాదన. ''దేశంలోని 65 శాతం మంది ఓటర్లు 40 ఏళ్ల లోపువారే. 50 శాతం 25 ఏళ్ల లోపువారే. కానీ 40 ఏళ్ల లోపున్న పార్లమెంటేరియన్లు మాత్రం కేవలం 12 శాతం. యువత ప్రజాప్రతినిధుల సంఖ్య బాగా పెరగాలి'' అంటారు సంయుక్త. ఆమె విజయపుర అసెంబ్లీ నియోజకవర్గవాసి. కనుక బాగల్‌కోట్‌కు బయటి వ్యక్తి అంటూ బీజేపీ విమర్శిస్తోంది. తాను బయటి వ్యక్తినెలా అవుతానని ప్రశ్నిస్తారామె. ''నేను అవిభక్త బీజాపూర్‌లో పుట్టా. ప్రతి ర్యాలీలోనూ నాకు ఘన స్వాగతం లభిస్తోంది. ఏ ఇంటికి వెళ్లినా నా ఇంటికి వెళ్లినట్టే ఉంటుంది'' అంటూ కొట్టిపారేస్తారు. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యంపైనా గళం విప్పుతున్నారు సంయుక్త. రాజకీయాల్లో ఎక్కువ మంది మహిళలుంటే విధాన రూపకల్పనలో మహిళా దృక్పథం వస్తుందన్నది ఆమె వాదన.

ఎనిమిదేళ్లుగా రంజాన్ ఉపవాసాలు...

సంయుక్త 12వ శతాబ్దపు మత, సంఘ సంస్కర్త బసవేశ్వరుని భక్తురాలు. అయితే ఎనిమిదేళ్లుగా రంజాన్ మాసమంతా విధిగా ఉపవాసం (రోజా) పాటిస్తున్నారు. మతమేదైనా విశ్వాసం మంచిదైనప్పుడు ఆచరించడంలో తప్పేముందని ప్రశ్నిస్తారు. ''పెద్దయ్యాక ఏమవుతావని నా చిన్నతనంలో ఎవరడిగినా ప్రధాని అవుతాననేదాన్ని. ఇప్పుడు ఎంపీ అయ్యే అవకాశం వచ్చింది. ఏమో, భవిష్యత్‌లో ప్రధాని కూడా అవుతానేమో!'' అని ఆశాభావం వ్యక్తం చేస్తారు సంయుక్త.